హైదరాబాద్ వార్త



# ప్రచార పాట్లు ఇన్నిన్నికాదయా..!

## - పై అంతస్థులకు ఎక్కలేక ప్రయాస - అవతారాలు మారుస్తున్నారు



దోష బండి వద్ద స్థానికులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాటామంతి



దోష వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

**జూబ్లీహిల్స్, నవంబరు 6, ప్రభాతవార్త:** **జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రచారం ఊపందుకొంది.. అయితే ఈ ప్రచారం కాస్త నేతలకు 'పరీక్ష'గా మారుతుంది. తలుపుతట్టడానికి తడబడుతున్న నేతల దృశ్యాలు కొన్ని ఆసక్తికరంగా మారాయి. కొన్ని సందర్భాల లో అభ్యర్థులు, నేతలు ఎనలేని పాట్లు పడాల్సి వస్తుంది.. మెట్లు ఎక్కలేక, కింది నుంచే చేతులు ఊపుతూ ప్రచారాన్ని నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. మరికొంతమంది తూతూ మంత్రంగా తమ ప్రచారాన్ని ఫొటోల వరకు కానిచ్చి.. ముగించి వెళ్తున్నారు.. ఇక కొందరు ఓటర్లను ఆకర్షించేందుకు అప్పటికప్పుడు అవతారాలెత్తుతూ ప్రచారంలో జోష్ నింపుతున్నారు.**

కటింగ్ షాప్‌కు వెళ్లిన బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి మల్లారెడ్డి కటింగ్ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇలా టిఫిన్ బండి, ఛాయ్‌బండి, కూరగాలయ బండి కనిపిస్తే చాలు.. ఆగిపోయి ఆయా పనుల్లో మమేకం అవుతున్నారు. బీజేపి నేతలు కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాంచదర్‌రావులు సైతం ఇదే దారిలో నడుచుకుంటున్నారు. నియోజకవర్గంలోని బోరబండ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, సోమాజీగూడ, షేక్‌పేట తదితర డివిజన్ల ప్రాంతంలో దాదాపుగా వ్యక్తిగత భవనాలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో చాలా వరకు మెట్ల మీది నుంచే నడుచుకుంటూ వెళ్లేలా ఉంటాయి. ఈ క్రమంలోనే కొందరు అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు ప్రచారానికి వెళ్లినప్పుడు



ఓటు వేయాలంటూ గడవ పట్టుకొని బ్రతిమలాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

ముందుగానే తన అనుయాయులను లిఫ్టు ఉందా..! అని అడుగుతున్నారు. కొందరు మెట్లు ఎక్కుతూ ఓటు వాళ్లది.. ఆయాసం మనది అంటూ తమ బాధను పంచుకుంటూ తోటివారిని నవ్విస్తున్నారు. ఒక అంతస్థు ఎక్కిన తరువాత మరో అంతస్థు ఉందా అంటూ ఆయాసపడి అడుగుతుండటంతో నవ్వులు పూస్తున్నాయి. ఒక మంత్రి మెట్లు ఎక్కిన ప్రతి సారి నీళ్ల సీసాతో అతని అనుయాయుడు సిద్ధంగా ఉంటున్నాడు. ఒక భవనం మెట్లు ఎక్కి కిందకు దిగగానే చుక్కలు కనిపిస్తున్నాయి. పక్కనే మరో భవనం అలాంటిదే కనిపిస్తే కంగారుపడిపోతున్నారు. కొందరు నేతలు ఓటర్లతో ముచ్చట పెట్టేందుకు కూరగాయలు, ఛాయ, టిఫిన్ బండ్ల దగ్గరనే ఆగిపోతున్నారు. దండాలు పెట్టి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. ప్రజలతో అక్కడే చిట్‌చాట్ చేస్తున్నారు. విక్రయించే వారి వద్ద కూర్చొని నీ కష్టం.. నా కష్టం ఒకేలా ఉందంటూ ఛలోక్తులు విసురుతున్నారు. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్‌లకు వెళ్తున్న నాయకుల పరిస్థితి మరోలా ఉంది. ఎర్రగడ్డ డివిజన్‌లో గేటెడ్ కమ్యూనిటీలు ఉన్నాయి. ఒకే అంతస్థులో అనేక ఫ్లాట్లు ఉండటంతో నడవలేక, రొప్పుతూ ముందుకు సాగుతూ టైం ఎంతైంది అంటూ తమ అనుయాయులను అడుగుతున్నారు. ఉదయం ప్రచారానికి వెళ్తున్న నేతలు మధ్యాహ్నం భోజనం సమయం అవుతుంది అంటే కాస్త విశ్రాంతి తీసుకోవచ్చని సంతోషపడుతున్నారు. కొందరు నేతలు మాత్రం ఫొటోలకు ఫోజులిస్తూ, తేలికైన మార్గాల్లో ప్రచారం నిర్వహిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.

### ఉదయం బద్ధకంగా.. సాయంత్రం ఉత్సాహంగా

కొన్ని పార్టీల నేతలు తమ నేతలకు, కార్యకర్తల ఇళ్ల ముందు ఉదయం 7 గంటలకే వాలిపోతున్నారు. కొందరు 6 గంటలకే నియోజకవర్గంలోకి వచ్చి చేరుతున్నారు. ప్రచారానికి వెళ్లాల్సిన నేతల, కార్యకర్తల ఇళ్ల ముందు వారు పడిగాపులు పడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు కార్యకర్తలు అన్నా.. ఇంత పొద్దున్నేనా.. రాత్రి అసలే పొద్దుపోయింది. అంటూ బద్ధకిస్తున్నారు. ఉదయం బద్ధకంగా నిద్రలేస్తున్న నేతలు, కార్యకర్తలు సాయంత్రం అయితే హుషారుతో వస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రచారం అనంతరం విందును ఏర్పాటుచేస్తుండటంతో చాలా మంది సాయంత్రం వేళ ప్రచారానికి ఆసక్తి చూపుతున్నారు. ఇక వారాంతాలు వస్తే చాలు.. చుక్క, ముక్క అంటూ వస్తున్న కోరికలను నాయకులు కాదనలేకపోతున్నారు. ఆదివారం వస్తే ఇంట్లో చికెన్, మటన్ కావాలంటూ కొందరు కోరుతున్న కోరికలతో నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

# తెరవెనుక రాజకీయం.!

**-ఓవైపు ప్రచారాలు..మరోవైపు మంతనాలు**
**-బిజీబిజీగా ఎమ్మెల్యే అభ్యర్థులు**
**-ప్రత్యర్థుల బలాలు,బలహీనతలపై ఆరా**
**-సమాచార సేకరణకు ప్రత్యేక టీమ్‌లు**
**-అసంతృప్తులతో సీక్రెట్ మీటింగ్‌లు**



**హైదరాబాద్, నవంబరు 6,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఓటింగ్ గడవు సమీపిస్తుంటంతో వివిధ పార్టీల అభ్యర్థులు ఎడతెరిపి లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓవైపు కాంగ్రెస్, మరోవైపు బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు మీటింగ్‌లు, బైక్‌ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. గెలుపుకోసం అందివచ్చే ఏఅవకాశాన్ని కూడా వదులుకోకుండా సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యర్థుల బలాబలాలలు,వ్యతిరేఖక అంశాలపై ఆరా తీస్తున్నారు. నాయకులుకార్యకర్తలతో నిఘా ఏర్పాటు చేసి అసంతృప్తులు, అసమ్మతి వాదులను ఆకట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వారిని ఎలా తమవైపు తిప్పుకోవాలా అని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈక్రమంలోనే ఎన్నికల రణరంగంలో ఎలాగైనా గెలిచితీరాలని ప్రత్యర్థిని మట్టికరిపించేందుకు చాణక్య వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఓవైపు బిఆర్ఎస్,కాంగ్రెస్‌లు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. కాంగ్రెస్ నుంచి సిఎం రేవంత్‌రెడ్డి, బిఆర్ఎస్ నుంచి కెటిఆర్‌లు రోజూ మీటింగ్‌ల నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌నుంచి మంత్రులు, బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఆయా డివిజన్లలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే పార్టీల అధిష్టానాల వ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ పోటీచేసే అభ్యర్థులు మాత్రం తమ గెలుపుపైనే ప్రధాన దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఎదుటి పార్టీల అభ్యర్థుల బలాబలాలు, బలహీనతలు వారిపై స్థానికంగా ఉన్న అసంతృప్తితోపాటు వారికి వ్యతిరేఖంగా పనిచేసే నాయకులు తదితర అంశాలపై తమకు నమ్మకంగా ఉండే వ్యక్తులతో సమాచారం సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగా తాము ఎవరితో సంప్రదింపులు జరిపితే ప్రత్యర్థికి వ్యతిరేఖంగా ఉన్నఓట్లు తమకు అనుకూలంగా మారుతాయనే కోణంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులు నమ్మిన వ్యక్తులతో పాటు ఇతర అభ్యర్థులకు వ్యతిరేఖంగా పనిచేసే వారితో నిత్యం రహస్య మంతనాలు జరుపుతున్నారు. దీంతో జూబ్లీహిల్ రాజకీయం మరింత రంజుగా మారింది.

**లెక్కలు తీసే బాధ్యత యువతకు..**

ఎగల్లీలో ఎన్నిఓట్లు ఉన్నాయి...అవి ఏపార్టీకి పడతాయి..డబ్బు ఇస్తే పడే ఓట్లు ఎన్ని..ఒకవేళ అలాంటి వారిని తమవైపు ఎలా తిప్పుకోవాలి అన్న వ్యూహంలో భాగంగా పలుపార్టీలు ఎవరికీ అనుమానం రాకుండా ప్రతి వంద ఓట్లకు ఇద్దరు యువకులు నియమించుకుంటున్నారు. చెప్పిన పనిచేస్తే వారికి రోజుకు 1000 నుంచి 2వేలు ఇస్తున్నారు. అవసరమైతే పార్టీ బూత్ ఏజెంట్లుగా మిమ్మల్నే పెడుతామని ఓటర్లతో నిత్యం టచ్‌లో ఉండాలని చెబుతున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కుటుంబాల వివరాలేమిటి... వారంతా ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు... దొంగ ఓట్లు ఉన్నాయా.. చనిపోయిన వారెవరైనా జాబితాలో ఉన్నారా అంటూ ఆరా తీస్తున్నారు.ఇప్పటికే ఎర్రగడ్డ, బోరబండ లాంటి ప్రాంతాల్లో పార్టీ నేతలతో కాకుండా ఎవరికీ అనుమానం రాకుండా యువకుల ద్వారా కాలనీలు,బస్తీలు, అపార్ట్‌మెంట్‌లకు మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తుంది.

# వరద ముంపు తప్పించారు..ప్లాట్లు కాపాడారు

## -హైడ్రాకు థాంక్స్ అంటూ ప్రజల హర్షాతిరేకాలు -మద్ధతుగా పలు ప్రాంతాల్లో ర్యాలీలు




అమీర్‌పేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

**హైదరాబాద్: నవంబర్ 6,ప్రభాతవార్త:** వరద ముప్పును తప్పించిన హైడ్రాకు పలు కాలనీ నివాసితులు ధన్యవాదాలు తెలిపారు. ర్యాలీగా వచ్చి హైడ్రాకు మానవహారంగా నిలబడ్డారు. అమీర్పేట, శ్రీనివాస్ నగర్, గాయత్రినగర్, కృష్ణ నగర్, అంబేద్కర్ నగర్ నుంచి వచ్చినా ఆ కాలనీల ప్రతినిధులు మైత్రివనం వద్ద ప్లకార్డులను ప్రదర్శించి హైడ్రాకు సంఘీభావం తెలిపారు. 5 సెంటీమీటర్ల వర్షం పడితే అతలాకుతలం అయిన మా కాలనీలకు వరద ముప్పు తప్పించారంటూ హైడ్రాను కీర్తించారు. అమీర్పేట్ మైత్రివనం వద్ద నడుములోతు నీళ్ల నిలబడి ఇబ్బందులు పడేవాళ్ళం అని.. హైడ్రా వచ్చింది.. అక్కడి భూగర్భ పైపులైన్లలో పూడికను పూర్తిగా తొలగించింది. దీంతో ఇటీవల 15 సెంటీమీటర్ల వర్షం పడిన వరద నీరు నిలవలేదు అని చెబుతూ హైడ్రా పనితీరుకు అభినందనలు తెలిపారు. ఎక్కడికక్కడ నాళాల్లో పూడిక పేరుకుపోవడంతో అంబేద్కర్ నగర్లో డ్రైనేజీ రోడ్లమీద పారేదని.. నేడు హైడ్రా చర్యలతో ఆ సమస్య పరిష్కారం అయ్యిందని అక్కడి నివాసితులు పేర్కొన్నారు. ఒక్క ఏడాదిలో హైడ్రా అనేక విజయాలు సాధించిందన్నారు. కాలనీల నుంచి ర్యాలీగా వచ్చి ఒకప్పుడు వర్ష వస్తె వణుకు వచ్చేదాన్ని ఇప్పుడా భయం లేదని పేర్కొన్నారు. పైగా కాలనీ, ప్యాట్నీ కాలనీ, విమాన్ నగర్, బీహెచ్ ఈ ఎల్ కాలనీచ ఇందిరమ్మ నగర్ ఇలా అనేక కాలనీల్లోని యింట్లో సామాన్లను వరద నీటిలో మునిగిపోయేవని ఈ ఏడాది ఈ సమస్యలేమీ ఎదురు కాలేదని తెలిపారు. 70 అడుగుల నాలా ప్యాట్నీ వద్ద 15 నుంచి 18 అడుగులకు కుంచించుకుపోవడంతో యిబ్బంది ఉండేదని.. హైడ్రా వచ్చి నాలా ను వాస్తవ వెడల్పునకు విస్తరించడంతో సమస్య పరిష్కారం అయ్యిందని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా ఈ సమస్య ఉండడం వల్ల వర్షం వస్తే మా కార్లన్నీ మునిగిపోయి లక్షల రూపాయల నష్టాలు వచ్చేవని వాపోయారు. దశాబ్దాల సమస్యను ఫిర్యాదు చేసిన వెంటనే హైడ్రా పరిష్కరించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది నాలాను విస్తరించి వరదముప్పును తప్పించారని పేర్కొన్నారు. అప్పటి రోజులు గుర్తుకు వస్తుంటే భయమేస్తోంది. ఆ భయాన్నిపారదోలి.. మా ప్లాట్లు మాకు వచ్చేలా చేసిన హైడ్రాకు ధన్యవాదాలు అంటూ పోచారం మున్సిపాలిటీలోని దివ్యానగర్ లేఔట్‌లోని 2218 మంది ప్లాట్ యజమానులు చెబుతున్నారు. హైడ్రాకు ఎన్నిసార్లు థాంక్స్ చెప్పినా సరిపోదు. అందుకే నేడు కూడా ర్యాలీ నిర్వహించి ధన్యవాదాలు చెబుతున్నామని.. గురువారం ర్యాలీ నిర్వహించిన సందర్భంగా తెలిపారు. వాస్తవానికి రహదారుల ఆక్రమణ, పార్కుల దురాక్రమణను హైడ్రా తొలగించింది. కాని మాకదే పెద్ద మేలు అయ్యింది. అడ్డగోడలు తొలగడంతో మా ప్లాట్లకు మేము వెళ్లడానికి వీలు కుదిరిందంటూ నాటి పరిస్థితులను గుర్తు చేశారు. హైడ్రా గాని రంగంలోకి దిగకపోతే.. రహదారులు, పార్కులు మాయమై.. తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేని పరిస్థితి అంటూ హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది జనవరి నెల 25వ తేదీన దాదాపు 200 ఎకరాల్లో 2218 ప్లాట్లుగా విస్తరించిన దివ్య లేఔట్ చుట్టూ 4 కిలోమీటర్ల మేర నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. అప్పుడు సంబరాలు చేసుకున్నాం.

ప్రహరీ నిర్మించి తమ ప్లాట్లలోకి వెళ్లకుండా నల్లమల్లారెడ్డి ఆంక్షలు విధించడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో హైడ్రాను ఆశ్రయించామని అప్పటి రోజులు గుర్తు చేసుకున్నారు. నల్లమల్లారెడ్డి కోటగోడలు, అడ్డ గోడలు బద్ధలు కొట్టి 2218 మంది ప్లాట్లకు విముక్తి కల్పించిన హైడ్రాకు ధన్యవాదాలంటూ మరో సారి ర్యాలీ నిర్వహించి అదే లే ఔట్‌లో సమావేశమయ్యారు ప్లాట్ యజమానులు. హైడ్రాకు మరోసారి ధన్యవాదాలంటూ నినదించారు.

# ఇన్‌స్టా వేదికగా డ్రగ్స్ దందా

**-బెంగళూరు నుండి డ్రగ్స్ సరఫరా చేస్తున్న యువకుల అరెస్టు**
**-రూ.2లక్షల విలువైన 18గ్రామల డ్రగ్స్ స్వాధీనం**
**-వివరాలు వెల్లడించిన డిసిపి యోగేష్ గౌతమ్**



**అత్తాపూర్ నవంబరు 6, ప్రభాతవార్త :** ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చేసుకొని డ్రగ్స్ దందా నడిపిస్తున్న యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.గురువారం రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎసిపి శ్రీనివాస్‌తో కలిసి డిసిపి యోగేష్ గౌతమ్ వివరాలను వెల్లడించారు.ఓ పరిచయం ఉన్న డ్రగ్స్ డిల్లర్ వద్ద కొనుగోలు చేసి బెంగళూరు నుండి రాష్ట్రానికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ ఎస్ఓటి ,మదాపూర్ పోలీసులు బృందాలతో జాయింట్ ఆపరేషన్‌తో ఆరంఘర్ చౌరస్తాలో నిందితులను అరెస్టు చేయడం జరిగిందని నిందితులు సంతోష్, సందీప్,శివ కుమార్ డ్రగ్స్‌ను బెంగళూరు నుండి తీసుకువచ్చి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పరిచమైన యువకులను డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని గురువారం పిల్లర్ నెంబర్ 307 హెచ్‌పి పెట్రోల్ పంప్ వద్ద వినియోగదారులు సాయిబాబు, విశాల్ రెడ్డి, సమీర్ వేచిచూస్తున్న సమయంలో వారిన్ని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.నిందితుల నుండి 18 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్,130 గ్రాముల గంజాయి,ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డ్రగ్స్ విలువ రూ 2 లక్షలు ఉంటుందన్నారు.నైజీరియా దేశం నుండి డ్రగ్స్ వస్తున్నట్టు గుర్తించామని డ్రగ్స్ ను సరఫరా చేస్తున్న నైజీరియన్స్ లొకేషన్ ఇంకా ట్రేస్ కాలేదని కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.డ్రగ్స్ సరఫరాదారులను పట్టుకోవడంలో రాజేంద్రనగర్ ఎస్ఓటి,మాదాపూర్ బృందాలు చకచక్యంగా వ్యవహరించారని వారిని డిసిపి అభినందించారు.

## హ్యాష్ ఆయిల్ బాక్స్‌లు, గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త :**

నగరంలోని బోయిన్‌పల్లి-సుచిత్ర రోడ్డులో హ్యాష్ తరలిస్తున్న హ్యాష్ ఆయిల్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తి హ్యాష్ ఆయిల్ తరలిస్తున్నాడనే ముందస్తు సమాచారం మేరకు సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య.. తన సిబ్బందితో కలిసి బోయిన్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద మాటువేశారు. స్కూటీపై వెళ్తున్న చింటు అలియాస్ హరిబాబును ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద 16 హ్యాష్ ఆయిల్ బాక్స్ (96 గ్రామాలు)లను సీఐ గుర్తించారు. స్వాధీనం చేసుకున్న హ్యాష్ ఆయిల్ విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ఏఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

**గంజాయి విక్రయాలు.. ఇద్దరు అరెస్టు..**

నగరంలోని బొల్లారం ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు డీటీఎఫ్ సీఐ సౌజన్య, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో 3.2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భరత్, ఉమేష్ వద్ద 2.080 కిలోలు, శశికాంత్ అనే మరో వ్యక్తి వద్ద 1.150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ. 1.60 లక్షలు ఉంచొచ్చని అంచనా. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ సౌజన్య తెలిపారు.

# మళ్లీ తుపాకీ పట్టిన సిపి సజ్జనార్

## - థ్రిల్లింగ్‌గా ఉంటుందంటూ ట్వీట్



**హైదరాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త**

ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరొందిన సీనియర్ ఐపిఎస్ ఆఫీసర్ వీసీ సజ్జనార్ మళ్లీ తుపాకీ పట్టారు. గురువారం ఉదయం నగర శివార్లలోని తెలంగాణ పోలీసు అకాడమీకి సీపీ సజ్జనార్ వెళ్లారు. హైదరాబాద్ సిటీ పోలీసు బృందంతో కలిసి ఆయన పిస్టల్‌తో షూటింగ్ ప్రాక్టీస్ చేశారు. షూటింగ్ రేంజ్‌కు వెళ్లడం, లక్ష్యం గురి తప్పకుండా కొట్టడం ఎప్పుడూ గొప్ప అనుభూతిని ఇస్తుందని, బుల్స్ ఐకి గురిపెట్టి కొట్టడం థ్రిల్లింగ్‌గా కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సీపీ సజ్జనార్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.వీసీ సజ్జనార్ నగర పోలీస్ కమిషనర్ ఈ ఏడాది అక్టోబర్ 30వ తేదీన బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. అంతకుముందు దాదాపు నాలుగేండ్లు టీజీఎస్ ఆర్టీసీ సిఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించే కంటే ముందు సజ్జనార్ సైబరాబాద్ సీపీగా విధులు నిర్వర్తించారు.

# చారిత్రక కట్టడాల దగ్గర మ్యాప్‌ను అందించండి

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ నవంబరు 6, ప్రభాతవార్త**

పాతబస్తీలో మెట్రో నిర్మాణ విషయంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. మెట్రో నిర్మాణాల వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని, పురావస్తు అనుమతి కూడా తీసుకోలేదని ఏపీడబ్ల్యూఎఫ్ పిటిషన్ దాఖలు చేసింది. చారిత్రక కట్టడాల సమీపంలో ఎలాంటి పనులు చేపట్టొద్దని నిబంధనలున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వం తరపున ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. పాతబస్తీ అభివృద్ధికి మెట్రో ఎంతో కీలకమని కోర్టుకు వివరించారు.మెట్రో రెండో దశ డిజైన్, నిర్మాణ పనుల గురించి ప్రధాన న్యాయమూర్తి ఏఏజీని ప్రశ్నించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సెకండ్‌ఫేజ్ మెట్రో పనులు చేపట్టినట్లు ఏఏజీ వివరించారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడానికే పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం.. నిర్మాణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని కోరింది. నిర్దేశిత చారిత్రక కట్టడాల వద్ద మెట్రో నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది.

# కరెంటోళ్ల ప్రజాబాట..

**-టిజిఎస్‌పిడిసిఎల్ వినూత్న కార్యక్రమం**
**-ప్రతి,మంగళ,గురు, శనివారాల్లో ప్రజల్లోకి**
**-ఆర్టిజన్ నుంచి ఉన్నతాధికారుల వరకు హాజరు**
**-క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలకు పరిష్కారం**
**-టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ వెల్లడి**



**హైదరాబాద్, నవంబర్ 6,ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తన పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల్లో కరెంటోళ్ల ప్రజాబాట పేరిట వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజా బాట కార్యక్రమం లో భాగంగా ప్రతి మంగళ, గురు మరియు శని వారాల్లో సిఎండీ నుండి ఆర్టిజన్ స్థాయి వరకుగల సిబ్బంది, అధికారులు నేరుగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ నెట్వర్క్ తనిఖీ చేస్తూ, వినియోగదారుల నుండి సలహాలు ఫిర్యాదులు స్వీకరిస్తూ ఎక్కడికక్కడ పరిష్కార చర్యలు చేపడతామని సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషా రఫ్ ఫరూఖీ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన మాట్లాడుతూ వారంలో మూడు రోజులు అనగా మంగళవారం, గురువారం, శనివారాల్లో ఉదయం 8:00 గంటల నుండి 10:30 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సీఎండీ నుండి ఆర్టిజన్‌వరకు సుమారు 9,500 మంది సి బ్బంది, డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీ ర్లు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు , అసిస్టెంట్ ఇంజనీర్లు, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్ తదితరులు అందరూ వివిధ ప్రాంతాల్లో గ్రూపులుగా పర్యటించి పరిశీలి స్తారని పేర్కొన్నారు. అందులోభాగంగా వినియోగదారులతో మాట్లాడి వారి నుండి సలహాలు సూచనలు స్వీకరిస్తారన్నారు. అలాగే ప్రజా బాటలో నమోదయిన ఫిర్యాదులను, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని దీని వల్ల విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడుపడి, ఫిర్యాదులు తగ్గడంతో పాటు నెట్‌వర్క్ బలోపేతం అవుతుందని విద్యుత్ నష్టాలు తగ్గుతాయని సీఎండీ పేర్కొన్నారు.

## వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం



అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు. చిత్రంలో మందాల భాస్కర్, చెరుకు రాంచందర్ తదితరులు

**సైఫాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త:** వర్గీకరణ వల్ల ఎస్సీలోని 58 కులాలకు గత 5 నెలలుగా విద్య, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని మాల సంఘాల జెఏసి ఛైర్మన్ మందాల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు జరుగుతున్న అన్యాయంపై అన్ని రాజకీయ పార్టీలకు, ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించి, విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెంటనే సవరించాలని, మాల సామాజిక వర్గానికి రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలని, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. సిఎం మాలలపై కక్ష సాధింపు చర్యలో భాగంగా మాల సామాజిక వర్గ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయని, వర్గీకరణతో మాలలు అన్ని రంగాలలో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా మాదిగలకు అనుకూలంగా చేసిందని ఆరోపించారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జెఏసి నాయకులు చెరుకు రాంచందర్, కనకరాజు, మంత్రి నరసింహా, బేరా బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వీనులవిందు పసందైన సినీసంగీత విభావరి



మల్టీటాలెంట్ ఆర్టిస్ట్ కళ్యాణి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వంశీరామరాజు, లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి, ఏడుకొండలరావు

**నాంపల్లి, నవంబరు 6 ప్రభాతవార్త :** ఉభయ తెలుగురాష్ట్రాల్లో ప్రభంజనం సృష్టించి ఉర్రూతలూగించిన పసందైన సినీగీతాలు ఆహుతులకు వీనులవిందు చేశాయి. ప్రముఖ సాంస్కృతిక సంఘసేవాసంస్థ సెవెన్‌హిల్స్ కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వర్ధమాన మధురగాయకులతో నిర్వహించిన సినీసంగీత విభావరి సంగీతప్రియులకు వినోదాన్ని ఆహ్లాదాన్ని పంచింది. తెలుగునాట అద్భుత సాహిత్య సంగీత గీతాలకు ప్రాధాన్యమిచ్చే పాటలను గాయనీగాయకులు తమ సుమధుర కంఠాల్లో అవలీలగా ఒలికించి ఆనందడోలికల్లో ముంచెత్తి అందరి ప్రశంసలందుకున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.ఏడుకొండలరావు నిర్వహణలో యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమానికి వేగేస్న ఫౌండేషన్, వంశీసంస్థల వ్యవస్థాపకుడు కళాబ్రహ్మ శిరోమణి ముఖ్యఅతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు లయన్ వి.వి.రాఘవరెడ్డి, వి.లక్ష్మి, వి.కృష్ణ, కె.రాజేష్ తదితరులతో కలిసి ప్రముఖ రైటర్, సింగర్, డబ్బింగ్ మల్టీ టాలెంటెడ్ కళాకారిణి కళ్యాణి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపారు. ఆణిముత్యాల్లాంటి సినిమా పాటలను ఆలపించి వీక్షకులను మెప్పించిన గాయకులకు, అద్భుత కార్యక్రమాన్ని నిర్వహించిన సెవెన్‌హిల్స్ సంస్థ, కొండలరావు, లక్ష్మిలను అభినందించారు.

## ఆర్టీఏ అధికారులను కలిసిన ఆటో డ్రైవర్ల జెఏసి నేతలు



ఆర్టీఏ జెటిసి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్ల జెఏసి నేతలు బి.వెంకటేశం, ఎ.సత్తిరెడ్డి, సలీం,శ్రీనివాస్, మొబిన్ తదితరులు

**హైదరాబాద్ నవంబరు 6, ప్రభాతవార్త**

ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆటో డ్రైవర్ల జెఏసి నేతలు ఆర్టీఏ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఏసి నేతలు బి.వెంకటేశం, ఎ.సత్తిరెడ్డి,ఎ.సలీం,ఎం.శ్రీనివాస్, మొబిన్‌లు మాట్లాడుతూ ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలని, ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, కొత్త ఆటోలకు పర్మిట్‌లు ఇవ్వాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఆలయాలను అభివృద్ధి చేయాలి: బోనాల



హన్‌మాన్ టెంపుల్‌లో పూజలు చేస్తున్న ప్రజా ఏక్తా పార్టీ అధ్యక్షులు బోనాల

**బేగంబజార్, నవంబర్ 6ప్రభాతవార్త:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం ముస్తాద్‌పురాలోనిచారిత్రాత్మకమైన హన్‌మాన్, బాబా మందిరంలో ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త పాల్గొన్ని ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మకమైనఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయం ఛైర్మన్‌ప్రదీప్‌కుమార్‌చారి, టెంపుల్ ట్రస్ట్ బోర్డు సభ్యులు మావురి దయానంద్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.

### శాంత్రి భద్రతలు కాపాడటంలో పోలీసులు ముందుంటారు

**అఫ్జల్‌గంజ్, నవంబర్ 6ప్రభాతవార్త:** శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ఎల్లప్పుడు ముందుఉంటారని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త అన్నారు. ఇటీవల వరుసపండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు పోలీసులు సహకరించడం పట్ల అభినందనీయమన్నారు. ఈమేరకు తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త, సోషల్ వర్కర్ రవియాదవ్‌లు సుల్తాన్‌బజార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహను మర్యాద కలిసిశాలువ కప్పి సన్మానించారు.

### ఐఎస్ సదన్ చౌరస్తా శివాలయంలో చోరీ

**సైదాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ చౌరస్తాలోని శివాలయంలో దొంగలు హుండీని పగులగొట్టి సుమారు రూ.70 వేలను ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం తెల్లవారుఝామున సుమారు 4 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాలపై వచ్చి దేవాలయం గ్రిల్స్‌కు ఉన్న తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. తమ వెంట తెచ్చుకున్న రాడ్‌తో హుండీని పగులగొట్టి దాంట్లోని డబ్బును తీసుకుని అక్కడ నుండి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు వెంటనే తమ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. చోరీ వివరాలు తెలుసుకుని సిసి కెమరాల పుటేజిలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. దేవాలయంలో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు అక్కడకు చేరుకున్నారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలి



గన్‌పార్కులో విద్యార్థులతోపాటు నిరసన దీక్షలో పాల్గొన్న వి.శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ

**సైఫాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త:** ఫీజుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ అనేక మంది విద్యార్థులు నల్ల బ్యాడ్జిలను, నల్ల కండువాలను ధరించి గురువారం గన్‌పార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన దీక్షకు రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజుల బకాయిలు చెల్లించకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయరాదని, కాంట్రాక్టర్ల నిధులు చెల్లింపులకు కమిటీలను వేసుకోవాలని విమర్శించారు. 12 వేల కోట్ల ఫీజుల బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం 14 లక్షల 75 వేల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని, పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం నిర్లక్ష్యంతో కోతలు, ఆంక్షలు, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నదని వారు ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, లెక్చరర్స్‌కు, సిబ్బందికి వేతనాలను చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ఫీజుల బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నందగోపాల్, భూపేష్‌సాగర్, ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.

## జ్వాలాతోరణం వెలుగుజిలుగుల్లో కార్తీకపౌర్ణమి



జ్వాలాతోరణం, కార్తీకదీపాలంకరణతో మహిళామణులు అద్భుత అలంకరణతో విశేష దర్శనమిచ్చిన శ్రీ సంగమేశ్వరస్వామి

**నాంపల్లి, నవంబరు 6 ప్రభాతవార్త :** కార్తీకమాస పుణ్యదినాలలో హరహర మహాదేవ శంభోశంకరంటూ శివనామ స్మరణతో మార్మోగుతున్న గాంధీనగర్‌లోని శ్రీ సంగమేశ్వరస్వామి-శ్రీ వేంకటేశరస్వామి వార్ల దేవాలయం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కార్తీక దీప కాంతుల వెలుగు జిలుగులు, జ్వాలాతోరణం మహా జ్వాలలు భక్తజనకోటికి ముక్తినందించాయి. రంగురంగుల పూలు, దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని ఈ పురాతన శ్రీసంగమేశ్వర శైవాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకంతో విశేషపూజలు భక్తిశ్రద్ధలతో శాస్త్రీయపరంగా ప్రారంభమై ఉదయం 7.30, 9, 10.30 మధ్యాహ్నం 12గంటలకు ఏకవార రుద్రాభిషేకములతో పరమశివునికి పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో దంపతులు, మహిళల కార్తీకదీపాలను వెలిగించి స్వయంగా ప్రత్యేక పూజలు చేయగా రాత్రి 7గంటలకు ప్రారంభమైన జ్వాలాతోరణ మహోత్సవం 10గంటల వరకు అశేష భక్తజన సందోహ శివనామస్మరణతో మిన్నంటాయి. అనంతరం శ్రీ సంగమేశ్వరస్వామి విశేష దర్శనం, నైవేద్యం, నక్షత్ర హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు అర్చకస్వాములు ఎం.చంద్రశేఖరశర్మ, ప్రవీణ్‌కుమార్, మురళీ కృష్ణమాచారి తదితరులు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఛైర్మన్ వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు.

## పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

**ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు విజ్ఞప్తి**

**హైదరాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు విజ్ఞపి చేశారు. ఈమేరకు గురువారం డీఎస్ఎస్ భవనం వద్ద విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వేల కోట్లు ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్ ఉండటం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అనేక మంది విద్యార్థులు విద్యను కూడా కొనసాగించలేక, విద్యకు, ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో కూడా ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్ వల్ల సిబ్బందికి వేతనాలు చెల్లించటం లేదని అన్నారు. ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, విద్యార్థుల తల్లి తండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, పెండింగ్ బకాయిలకై నిధులు విడుదల చేయాలని, లేనిపక్షం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కమీషనర్ బాలమాయాదేవికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడిఎస్ఓ సలహాదారు డాక్టర్ ఆర్.గంగాధర్, జిల్లా అధ్యక్షులు నితీష్, నాగరాజు, సభ్యులు విశాలి, దానిష్, నిహిత, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడిషీటర్ హత్యను ఛేదించిన పోలీసులు

**-ట్రాన్స్‌జెండర్‌పై అత్యాచార కేసు వివాదమే ఘర్షణకు కారణం**
**-ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ

**జగద్గిరిగుట్ట, నవంబర్ 6, ప్రభాతవార్త**

హైదరాబాద్ నగరంలోని జగద్గిరిగుట్టలో దారుణ హత్య చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం జగద్గిరిగుట్ట బస్టాండ్ వద్ద రౌడీ షీటర్ రోషన్ సింగ్ (25)ను మరో రౌడీషీటర్ బాలశౌ రెడ్డి, అతని అనుచరులు ఆదిల్, మహమ్మద్‌లు కలిసి కత్తులతో దారుణంగా నరికి హత్య చేశారు. హత్య అనంతరం నిందితులు బులెట్ బైక్‌పై అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో షాకింగ్ వివరాలు బయటపడ్డాయి. సుమారు 15 రోజుల క్రితం రోషన్ సింగ్, మరో ఆరుగురు మిత్రులు కలిసి జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఓ ట్రాన్స్‌జెండర్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై బాధితుడు బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. అయితే ట్రాన్స్‌జెండర్‌పై అత్యాచార కేసులో తాము చిక్కుకున్నామనే ఆగ్రహంతో రోషన్ సింగ్, తన స్నేహితుల మధ్య డబ్బు చెల్లింపుపై గొడవలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో బాలశౌరెడ్డి, ట్రాన్స్‌జెండర్‌ను కేసు పెట్టమని ఉసిగొల్పాడని రోషన్ సింగ్ అనుమానించాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. చివరికి రోషన్ సింగ్‌ను హత్య చేయాలన్న ఉద్దేశంతో బాలశౌరెడ్డి, ఆదిల్, మహమ్మద్‌లు బుధవారం జగద్గిరిగుట్ట బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. వీరిమధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీయగా మహమ్మద్ వెనకనుంచి రోషన్ సింగ్‌ను పట్టుకోగా, బాలశౌరెడ్డి కత్తితో దారుణంగా పొడిచాడు. అనంతరం ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన విజువల్స్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన రోషన్ సింగ్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు రోషన్ సింగ్, నిందితులు బాలశౌరెడ్డి, ఆదిల్, మహమ్మద్‌లపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి ముగ్గురినీ రిమాండుకు తరలించినట్లు మేడ్చల్ ఇన్‌చార్జ్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.

## ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలి



డైరెక్టర్ చక్రపాణికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్, వెంకటేష్, జీవన్‌రెడ్డి, నాగయ్య తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 6,ప్రభాతవార్త:**

డిస్కం పరిధిలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (కమర్షియల్) చంద్రపాణిని కోరింది. ఈమేరకు గురువారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి 9అంశాలతో కూడిన వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా తమవినతిని పరిశీలించిన డైరెక్టర్ తగిన సమయం తీసుకుని ప్రతిసమస్యపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ మద్దూనూరి వెంకటేష్, ఉపాధ్యక్షులు జీవన్‌రెడ్డి, కోశాధికారి నాగయ్య, సికింద్రాబాద్ అధ్యక్షులు సల్లావుద్దీన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### చెన్న మల్లిఖార్జున స్వామి దేవాలయంలో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న ఏసిపి (ఇంటిలిజెన్స్) రుద్ర భాస్కర్

**చార్మినార్, నవంబరు 6 ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి చండీ హోమం,దీపోత్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఏసిపి (ఇంటిలిజెన్స్) రుద్ర భాస్కర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతీ సంవత్సరం ఆలయంలో వైభవంగా దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని దేవాయలం ప్రధాన పూజారి కోటీ హరీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

### ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం



**చార్మినార్,నవంబరు 6 ప్రభాతవార్త :**

ఎఐసిసి ఇంఛార్జి తెలంగాణ మీనాక్షి నటరాజన్‌ను చార్మినార్ నియోజకవర్గానికి చెందిన లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ కో కన్వీనర్ పురుషోత్తం గుప్తతో పాటు పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ కో కన్వీనర్ పురుషోత్తం గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నా రూటే సెపరేటు

**-నగరంలో ఓ ఏసిపి పనితీరు వివాదాలమయం**
**-భూ వివాదాల్లో జోక్యం...ఇన్ స్పెక్టర్‌ల పై ఒత్తిడి**
**-పోలీసు అధికారులలో ఆందోళన**

**హైదరాబాద్ నవంబర్ 6, ప్రభాతవార్త :** సౌత్ వెస్ట్ జోన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ ఏసీపీ రూటే సఫరేటుగా మారింది. తనకు నచ్చిన వారిపై ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు అందిన పట్టించుకోదు. తనకు నచ్చని వారిపై ఫిర్యాదు అందుకే చాలు లోపల వేసేస్తాడు. దీంతో స్థానికంగా ఉన్నటువంటి పోలీసు అధికారులతో పాటు సిబ్బంది ప్రజలు ఆయన ప్రవర్తనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తన పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్లలో చోటుచేసుకునే సివిల్ వివాదాల్లో తానే ప్రత్యక్షమై జోక్యం చేసుకుంటున్నారని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఇన్‌స్పెక్టర్‌ల పై ఒత్తిడి**

పోలీసు విభాగానికి సంబంధించిన ఇన్ స్పెక్టర్ లను పక్కన బెట్టి, తన సొంత విధానాన్ని అమలు చేస్తూ, నచ్చిన విధంగా కేసులు నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తన మాట వినని అధికారులకు మెమోలు జారీ చేస్తూ వారిని వేధింపులకు గురి చేస్తున్నాడని తెలుస్తోంది. దీంతో స్థానికంగా ఉన్నటువంటి పోలీస్ స్టేషన్ ల లో విధులు నిర్వహించాలంటేనే పోలీసు అధికారులతో పాటు సిబ్బంది హడలిపోతున్నారు.

**భూ వివాదాల్లో జోక్యం**

సదరు ఏసీపీ ఇటీవల తన డివిజన్ పరిధిలో వందల కోట్ల విలువ చేసే భూమి వివాదంలో ఆయనే జోక్యం చేసుకుని, ఒక వర్గానికి బహిరంగ వత్తాసు పలికినట్లు సమాచారం. తనకు కూడా భూకబ్జాలో లోపాయ కారీ ఒపందంతొ కుదీన వాటా ఉంది అనీ ఆ ప్రాంతంలో గుసగుసలు.ఆరోపణలతో పాటు, మరో వర్గంపై అక్రమంగా కేసు నమోదు చేయించాడని వినికిడి.

**ఉన్నతాధికారుల జోక్యం**

కొన్ని కేసుల్లో ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేయాల్సి వచ్చిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అయితే, సాధారణ పరిస్థితుల్లో తనకు అనుకూలంగా మాత్రమే కేసులు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

**పోలీసు అధికారులలో ఆందోళన**

డివిజన్‌లో ఎక్కడైనా సివిల్ వివాదం తలెత్తితే తప్పనిసరిగా తనకు సమాచారం ఇవ్వాలని, తన అనుమతి లేకుండా జోక్యం చేసుకోవద్దని, లేకపోతే మెమోలు జారీ చేస్తానని" ఆయన హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక పోలీసు అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చర్చనీయాంశంగా ఏసీపీ ప్రవర్తన**

ప్రస్తుతం సౌత్ వెస్ట్ జోన్‌లో ఈ ఏసీపీ వ్యవహారమే ప్రధాన చర్చగా మారింది. భూ వివాదాల్లో జోక్యం, అధికారులపై ఒత్తిడి, మెమోలు జారీ వంటి పరిణామాల వల్ల విభాగంలో అసంతృప్తి పెరిగిపోతోంది. ఏసిపి అధికారి తీరుపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## ఉద్యానవన రంగంలో నూతన అధ్యాయం

**-ఎస్‌కెఎల్‌టిజిహెచ్‌యూ,పిఆర్‌డిఐఎస్ మధ్య కీలక ఒప్పందం**



**అత్తాపూర్ నవంబరు 6, ప్రభాతవార్త :**

తెలంగాణ ఉద్యాన రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు హైదరాబాద్ లోని పార్టిసిపేటరీ రూరల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ సొసైటీ మధ్య గురువారం కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ చారిత్రాత్మక ఒప్పం దం ద్వారా ఇరు సంస్థలు తమ వనరులు, నైపుణ్యాలను పంచుకుంటూ ఉమ్మడి లక్ష్యాల దిశగా పయనించనున్నాయి. ముఖ్యంగా సామర్థ్యాల పెంపు దల, శిక్షణ, పరిశోధన, విస్తరణ మరియు అభివృద్ధి కార్యక్రమాలలో పరస్ప రం సహకరించుకోవడానికి అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం కింద, రెండు సంస్థలు సంయుక్తంగా జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సులు, వర్క్ షాప్‌లు మరియు సెమినార్లను నిర్వహించడంతో పాటు, ఉద్యాన మరియు అనుబంధ రంగాల అధికారులకు, శాస్త్రవేత్తలకు, మరియు ప్రగతిశీల రైతుల కు శిక్షణ కార్యక్రమాలను రూపొందించనున్నాయి. క్షేత్రస్థాయి కార్యకలాపాలు, రైతు క్షేత్ర పాఠశాలలు (ఎఫ్‌ఎఫ్‌ఎస్), దత్తత గ్రామ కార్యకలాపాలు, మరియు ప్రభావ అంచనా అధ్యయనాలపై దృష్టి సారించనున్నారు. అంతేకా కుండా, ఇరుపక్షాలు ప్రాజెక్ట్ ప్రతిపాదనలను అభివృద్ధి చేయడం ద్వారా బాహ్య నిధుల అవకాశాలను అన్వేషించి, శాస్త్రీయ సామగ్రి, ప్రచురణలు మరియు సమాచారాన్ని పంచుకోనున్నాయి. ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి వచ్చి, ప్రారంభంలో రెండేళ్లపాటు చెల్లుబాటులో ఉంటుంది. ఉద్యాన రంగంలో పరిశోధన మరియు అభివృద్ధిని ప్రోత్సహించే ఈ సహకారం ద్వారా రాష్ట్రంలోని రైతులు మరియు భాగస్వాములకు విస్తృతమైన ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 2026 రెండో వారం లో జరిగే జాతీయ సదస్సు నార్మ్ మరియు కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తుందని ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పిఆర్‌డిఐఎస్ అధ్యక్షుడు మరియు కార్యనిర్వాహక డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.వి. రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్ శ్రీనివా సన్, జోనల్ హెడ్ డాక్టర్ అనిత కుమారి, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి ప్రశాంత్ మరియు సైంటిస్టులు పాల్గొన్నారు.

## మహంకాళీ ఏసిపి సైదయ్యపై బదిలీ వేటు

**బేగంపేట నవంబరు 6,ప్రభాతవార్త**

నార్త్‌జోన్ పరిధిలోని మహంకాళీ ఏసీపీ ఎస్.సైదయ్యపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ బదిలీ వేటు వేసారు.ఏసీపీ సైదయ్యపై అవినీతి ఆరోపణలు రావడంతో సీపీ శాఖ పరమైన చర్యలు చేపట్టారు. సైదయ్య ను కార్ హెడ్ క్వార్టర్స్ కు బదిలీ చేసారు.ఆయన స్థానంలో గోపాల పురం పి.సుబ్బయ్యను ఇన్‌ఛార్జిగా నియమించారు.తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అదనపు ఇన్‌ఛార్జిగా ఆయన కొనసాగనున్నారు.

### ప్రకాశం కిరణాలు సంపాదకీయాలు సంపుటి ఆవిష్కరణ



ప్రకాశం కిరణాలు సంపాదకీయాలు సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి నవంబర్ 6 (ప్రభాతవార్త) :**

జివిఆర్ ఆరాధనా కల్చరల్ ఫౌండేషన్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో పొత్తూరి సుబ్బారావు రచించిన పదునాల్గవ గ్రంథం ఖీప్రకాశం కిరణాలు ఖీసంపాదకీయాలు సంపుటి ఆవిష్కరణ సభ గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బా రావు కళావేదికలో ఆంధ్రప్రదేశ్ అధికారభాష సంఘం పూర్వ అధ్యక్షుడు ప్.విజయ బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ చారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ గ్రంథాన్ని కవి, రచయిత పి ఎస్ వి ప్రసాద్ కు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామ రాజు,, నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, సినీ గేయరచయిత మోనశ్రీ మల్లిక్, సాహితికిరణం సలహాదారు పెద్దూరు వెంకట దాసు, సాహితీవేత్త డాక్టర్ పి.లలితవాణి, నిర్వహణ సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.వి.రాఘవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బాల్యం అంశంపై కవి సమ్మేళనం జరిగింది.

## నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇంజనీర్స్ నూతన కమిటీ

**హైదరాబాద్, నవంబర్ 6,ప్రభాతవార్త:**

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఫర్ ఎలక్ట్రికల్ సేఫ్టీ తెలంగాణ ఛాప్టర్‌నుకు నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా పూజారి నరసింగరావు , సెక్రటరీగా వంగరి స్వర్ణ లతను నియమించినట్లు జాతీయ అధ్యక్షులు కె. గోపకుమార్, ఫౌండర్ మెంబర్ డి. కృష్ణ కుమార్ తెలిపారు. భారత దేశాన్ని విద్యుత్ భద్రతాయుతంగా, ప్రమాదరహితంగా మలచడమే దీని ప్రధాన లక్ష్యం తెలిపారు. ఈమేరకు రాయదుర్గంలోని లెమన్ ట్రీ హోటల్లో ఎర్తింగ్ సిస్టం పై ఎలక్ట్రికల్ టెక్నికల్ సెమినార్‌ను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి( సిఈఐజీ) కే. నందకుమార్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఎర్తింగ్ సిస్టంను సరిగ్గా ఇంప్లిమెంట్ చేసినట్లయితే విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్ వై.లింగారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంలో అరికట్టాలంటే నాసికమైన కేబుల్ ఆరికట్టాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగాఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రాన్ని విద్యుత్ భద్రతాయుతంగా ప్రమాదరహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ లైసెన్సింగ్ బోర్డు సెక్రటరీ టి. కాంతారావు, ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్లు పి.మధు, టి.చంద్ర శేఖర్, ఏ.రాజు, రాజేష్ కుమార్, జి.దయమాని, ఉదయశ్రీ, సునీతారెడ్డి, టి. క్రిష్ణ, సక్రునాయక్‌తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్పలో వ్యక్తి దుర్మరణం

**బాచుపల్లి, నవంబర్ 6, ప్రభాతవార్త**

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట రాజీవ్ గృహకల్ప బ్లాకు నెంబర్ 87 సమీపంలో ఒంటరిగా వీధుల్లో తిరిగే భాస్కర్ అనే వ్యక్తి మరణించాడు. అతడు స్థానికంగా చిన్నాచితగా పనులు చేసుకుంటూ జీవనం గడిపేవాడు. అతనికి బంధువులు ఎవరు స్థానికంగా లేరు. అతను ఒక్కడే నివసించేవాడు. రాత్రి వేళలో ఫుట్‌పాత్‌పై నిద్రించేవాడు. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో స్థానికులు బ్లాక్ నెంబర్ 87 వద్ద భాస్కర్ అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా అతను అప్పటికే మరణించి ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. మృతుడి కుటుంబ వివరాలు తెలుసుకోవడం కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అతను బుధవారం రాత్రి 87 బ్లాక్ పై కప్పు పై నిద్రించి ఉంటాడని, ప్రమాదవశాత్తు నిద్రమత్తులో పైనుండి కిందపడి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు సుమారు వయసు 55 సంవత్సరాలు, నీలం రంగు టీ షర్ట్, నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. గత పది సంవత్సరాలుగా ఒంటరిగానే ఈ కాలనీ పరిసరాలలో చిన్న చిన్న పనులు చేస్తూ ఫుట్ పాతుపై నివసించేవాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. భాస్కర్ బంధువులు ఎవరైనా తెలిసిన వారు ఉంటే బాచుపల్లి పోలీసులను సంప్రదించాలని పోలీసులు ప్రకటించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భాస్కర్ మృతదేహంపై ఎడమ కాలుకు రక్తస్రావం, గాయం అలాగే ఎడమ కన్నుపై గాయం అయి ఉంది. మొదటి ఫ్లోర్ నుండి కింద పడిన కారణంగానే ఒంటిపై గాయాలు దెబ్బలు తగిలి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నాలాలో పడి వ్యక్తి మృతి

**తార్నాక, నవంబర్ 6 ప్రభాతవార్త :**

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. లాలాపేట్‌లో పెద్ద నాలా చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో లేకపోవడంతో ఓ వ్యక్తి ఓ వ్యక్తి నాలాలో పడి మృతి చెందాడు. ఈ విషాధకర ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ రఘుబాబు, ఎస్ఐ యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం. శాంతినగర్‌లోని ఆర్యనగర్ ప్రాంతానికి చెందిన అశోక్(43) రోడ్ల వెంబండి చిత్తు పేపర్లను సేకరిస్తూ స్థానికంగా ఉన్న లాలాపేట్ బ్రిడ్జిల కింద, ఫుట్పాత్లపై ఉంటూ జీనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 8 గంటల సమయంలో లాలాపేట నుంచి సత్యనగర్ వెళ్లే మార్గంలో ఉన్న లాలాపేట్ పెద్ద నాలా ఓపన్‌గా ఉండటంతో అతను అక్కడికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. దీంతో నీళ్లలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు.ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు చేరుకునేలేపో అతను మృతి చెంది కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నాలాలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా ఇటీవల నాలాను శుభ్రం చేయించిన జీహెచ్ఎంసీ అధికారులు నాలా చుట్టు ఉన్న ఫెన్సింగ్ వైరును తొలగించారు. దీంతో అతను ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతి చెందాడు.

## పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు మొత్తం చెల్లించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నేతలు

**సరూర్‌నగర్, నవంబర్ 6, ప్రభాతవార్త :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున విద్యార్థులు, బీసీ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణం స్కాలర్‌షిప్ బకాయాలను పూర్తిగా చెల్లించాలి, అలాగే ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్య కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ పేద బడుగు విద్యార్థులు చదువుకు దూరం చేసే కుట్రలు ప్రభుత్వం చేస్తున్నదని ఆరోపించారు. బకాయిలు ప్రభుత్వం ఇంకా ఆలస్యం చేస్తే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని. అందుకే స్కాలర్‌షిప్ బకాయాలు మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలి డిమాండ్ చేశారు. లేని పక్షంలో లక్షలాది మంది విద్యార్థులతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతాయని హెచ్చరించారు.

## భువనేశ్వరికి ఘన స్వాగతం

### : రాష్ట్ర తెలుగు యువత హర్షధ్వానాలు



**నేరెడ్ మెట్, నవంబర్ 6.ప్రభాతవార్త** లండన్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐ ఓ డి) సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డుతో పాటు, గోల్డెన్ పీకాక్ ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ అవార్డు అందుకున్న ఎన్‌టిఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరి హైదరాబాద్ చేరుకోగా, తెలంగాణ రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు డా. పొగాకు జైరామ్ చందర్, ప్రధాన కార్యదర్శి నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో యువత సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ ముదిరాజ్ ఈ నెల 7న జరగనున్న తన వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను భువనేశ్వరికి అందజేశారు.

## గణితశాస్త్రంపై విస్తృత ఉపన్యాసం



**నేరెడ్ మెట్, నవంబర్ 6,ప్రభాతవార్త:** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిఫరెన్షియల్ ఈక్వేషన్స్" అనే అంశంపై మంగళవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ ఉపన్యాసానికి ఆలేర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సి. హెచ్. జానయ్య ముఖ్య వక్తగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు మాట్లాడుతూ, విద్యార్థులలో సాంకేతిక అవగాహన పెంపొందించడంలో ఇటువంటి ఉపన్యాసాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విభిన్న అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. నూతన బోధనా విధానాల ద్వారా గణితశాస్త్రాన్ని సులభంగా అర్థం చేసుకునే దిశగా ప్రయత్నించాలి" అని అన్నారు. డా. జానయ్య తన ఉపన్యాసంలో డిఫరెన్షియల్ సమీకరణాల ప్రాముఖ్యత, వాటి వినియోగాలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో వాటి అన్వయాలు గురించి వివరించారు. గణితశాస్త్రం ప్రతి శాస్త్రానికి పునాది. డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ సైన్స్, ఇంజినీరింగ్, ఎకనామిక్స్ రంగాలలో విస్తృతంగా ఉపయోగపడతాయి. విద్యార్థులు ఆలోచనాత్మక దృక్పథంతో అధ్యయనం చేస్తే గణితం సులభమవుతుంది," అని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు, అధ్యాపకులు కలిసి డా. జానయ్యను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి డా. హరిత, గణిత అధ్యాపకురాలు ఆర్. సరిత, వైస్ ప్రిన్సిపాల్ డా. అడవిరాజు, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

### : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి


దాడికి గురైన జిహెచ్‌ఎంసి సిబ్బందిని పరామర్శిస్తున్న బిజెపి నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, సండడి సురేందర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 6, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి మున్సిపల్ కార్మికుల పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి, నాయకులు సండడి సురేందర్ రెడ్డి తదితరులు పేర్కొన్నారు. మూసారాంబాగ్ లో దాడికి గురైన జిహెచ్‌ఎంసి పారిశుద్ధ్య విభాగం కామాటి యాదయ్య, ఎస్‌ఎఫ్‌ఎ శ్రీనివాస్‌లను వారు పరామర్శించి దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని మలక్ పేట పోలీసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగం సిబ్బందిపై దాడికి పాల్పడిన యువకులు బంగ్లాదేశీయులుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ఇటువంటి దౌర్జన్యాలకు పాల్పడే బంగ్లాదేశీయులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నవీన్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ తప్పనిసరి : విక్రమ్ గౌడ్



**నేరేడ్‌మెట్, నవంబర్ 6,ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు సాధించాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపుతో గురువారం సైనికపూరిలోని మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహం ఎదుట బీసీ సంఘాల ఆధ్వర్యంలో మౌన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ, బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచుతూ తీసుకొచ్చిన జీవో 9ను కొంతమంది కోర్టులో సవాల్ చేయడంతో అది నిలవలేదని తెలిపారు. "బీసీలకు శాశ్వతంగా రాజకీయ రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ ద్వారానే సాధ్యం. తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా 42 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం నిర్ధారించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో మెజార్టీ జనాభాగా ఉన్న బీసీలను ఇక నిర్లక్ష్యం చేయరాదని ఆయన హెచ్చరించారు. "బీసీల హక్కుల కోసం పార్టీలకతీతంగా అందరూ ఐక్యంగా పోరాడాలి. బీసీల రిజర్వేషన్ల పెంపు బాధ్యత కాంగ్రెస్, బీజేపీ పార్టీలదే" అని విక్రమ్ గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఈ డిమాండ్‌ను ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లాలని కోరారు. బీసీల రిజర్వేషన్లపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తే వచ్చే నెల మొదటి వారంలో వేలాదిమంది బీసీలతో కలిసి పార్లమెంట్ ముట్టడి చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపేష్ సాగర్, బీసీ నాయకులు సంతోష్ సాగర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రం రాజక్, బీసీ అడ్వకేట్ అసోసియేషన్ నాయకుడు మధుసూదన్ గౌడ్, బీసీ యువజన సంఘం నాయకులు మనోజ్ చారి, శ్రీనివాస్ చారి, గౌతమ్ ప్రజాపతి, శివతేజ గంగపుత్ర, మోహన్ ముదిరాజ్, భాష, శ్రీనాథ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ముందస్తు ఫలితాల ఊహాగానాలపై నిషేధం విధించాలి : రాజేశ్వర్ రెడ్డి


ఎన్నికల అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేశ్వర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, నవంబరు 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలకు సంబంధించి వివిధ మాధ్యమాలలో ప్రసారమవుతున్న ముందస్తు ఫలితాలు ఊహాగానాల పై నిషేధం విధించాలని మలక్ పేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికలు జరుపుటకు ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేయడం విధితమే అని తెలిపారు. ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఎన్నికలు ముగిసే రోజు అనగా ఈనెల 11వ తేదీ వరకు ఎటువంటి ముందస్తు ఫలితాల గురించి ప్రకటించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇటువంటి ఊహాగానాలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్లు అయోమయాన్ని గురవుతున్నారని, దీంతో ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే ఎన్నికల అధికారులు స్పందించి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించి వివిధ మాధ్యమాలలో వస్తున్న ముందస్తు ఊహాగానాల ఫలితాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. వెంటనే ఎన్నికల అధికారులు స్పందించి ఈ అంశం గురించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి బొమ్మ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్డును పూర్తి చేయడంలో పాలకుల విఫలం : శ్రీరాములు యాదవ్


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్, నాయకులు

**సరూర్‌నగర్, నవంబర్ 6 ప్రభాతవార్త:** రేడియల్ రోడ్డును నిర్మించడంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలకులు విఫలమయ్యారని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. రేడియల్ రోడ్డు నెంబర్ 26 పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా హాజరైన అందెల పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డు మధ్యలో బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2009లో నాటి కాంగ్రెస్ పాలనలో అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి కంచన్‌బాగ్ నుండి బాలాపూర్ చౌరస్తా, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌ల మీదుగా ఆదిభట్ల ఔటర్ రింగ్‌రోడ్డు వరకు 150 ఫీట్ల రేడియల్ రోడ్డు (నెంబర్ 26)ను మంజూరు చేస్తే నాటి నుండి నేటి వరకు ఎవరూ రోడ్డు పనులను పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు రోజుకూ పెరుగుతున్న జనాభా వల్ల ఈ రోడ్డు ప్రయాణాలకు సరిపోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. 2017లో రోడ్డు కోసం పాదయాత్ర చేసిన సబితా ఇంద్రారెడ్డి గత ఎన్నికలకు ముందు రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేయలేదని విమర్శించారు. దాదాపు రెండు సంవత్సరాల నుండి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఇక్కడి రోడ్డు సమస్యలను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రేడియల్ రోడ్డు నిర్మాణ పు పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలువురు బిజెపి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముగిసిన లక్ష దీపోత్సవం


ఉప్పల్ భగాయత్‌లో లక్ష దీపోత్సవం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మేకల మధుసూధన్‌రెడ్డి తదితరులు

**శివనామస్మరణతో మార్మోగిపోయిన ఉప్పల్ భగాయత్**

**ఉప్పల్, నవంబరు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో భగాయత్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లక్ష దీపోత్సవం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా ఐదవ రోజున దీపారాధనతో ప్రారంభమై లింగాభిషేకం, లక్ష బిల్వార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ పండితులు శ్రీనివాస బంగారయ్య శర్మ ప్రవచనా సూక్తులు, సనాతన ధర్మ గురించి వివరించారు. నేటి పిల్లలకు పెద్దలు నేర్పించాల్సిన విద్యాబుద్ధులను, కార్తీక మాస దీపం విశిష్టత, తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా దీపోత్సవ కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. అదేవిధంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జ్వాలా తోరణం భక్తులను ఎంతో ఆకర్షించింది. పరమేశ్వరునికి మహా మంగళ హారతులు భక్తులను మరిపించాయి. అనంతరం పలువురు చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తి గీతాలతో పరమశివుని భక్తి లీలామాయలో భక్తులు పరవశించిపోయారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి, పలువురు భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన


ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ సిఐ జి.నాగరాజు తదితరులు

**ఉప్పల్, నవంబరు 6 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించినట్లు ఉప్పల్ ట్రాఫిక్ సిఐ జి.నాగరాజు పేర్కొన్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని గురువారం ఉప్పల్‌లో ఆటో, ట్రాలీ ఆటో మరియు డిసిఎం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమలో సిఐ నాగరాజు మాట్లాడుతూ వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని, వాహనం నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనం నడుపునప్పుడు పాటించాల్సిన రోడ్డు నియమాలు, రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్నప్పుడు జరుగు ప్రమాదాలు, హెల్మెట్ ధరించుట సీట్ బెల్ట్ పెట్టుకొనుట తదితర అంశాలపై డ్రైవర్లకు వివరించారు. భారీ వాహనాలకు ఉదయం 7:30 నుంచి 11:30 వరకు అనంతరం సాయంత్రం 4:00 నుంచి రాత్రి 10:30 వరకు నో ఎంట్రీ ఉందని తెలిపారు. అట్టి సమయాలు పెద్ద వాహనాలు, గూడ్స్ వెహికల్ వచ్చి ప్రయాణికులకు అంతరాయం కలిగించ వద్దని, లేనిచో చలాన్లు విధించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు రోహిత్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్


నిర్వహకుల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రోహిత్‌కుమార్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 6 ప్రభాతవార్త :** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని, ఉపాధ్యాయులు బోధించే గురువులు మాత్రమే కాదని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే శిల్పులని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం విద్యా ప్రస్థానానికి వెలుగునిచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రోహిత్ కుమార్ గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. మన సమాజంలో ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు. అలాంటి కీర్తి గడించిన ఆదర్శ ఉపాధ్యాయులు రోహిత్ కుమార్ ఉంటారని తెలిపారు. విద్యా రంగంలో ఆయన చేసిన నిస్వార్థ కృషి, నిబద్ధతకు ప్రతిఫలంగా ఇటీవల ఆయనకు గౌరవ డాక్టరేట్ లభించిందన్నారు. రోహిత్ కుమార్ బోధనా యాత్ర రెండు దశాబ్దాలకుపైగా కొనసాగి, అనేక పాఠశాలల్లో అమూల్య సేవలతో నిలిచిపోయిందన్నారు. ప్రతి నియామక స్థలంలో ఆయన విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మకత పెంపొందించడంతో పాటు, వారి భవిష్యత్తుకు వెలుగు చూపించారని తెలిపారు. విద్యా రంగానికి చేసిన విశేష కృషిమండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో శిక్షణా కార్యక్రమాలు, విద్యా సేవలు అందించారని తెలిపారు. స్టడీ మెటీరియల్ రూపకల్పన చేసి వేలాది మంది విద్యార్థులకు సహాయం చేయడం. యూట్యూబ్ ఛానళ్ల ద్వారా పాఠాలు, వ్యాకరణ వీడియోలు రూపొందించి సులభంగా జ్ఞానాన్ని అందించారని తెలిపారు. నిబద్ధత, విద్యా పట్ల అంకితభావం ఫలితంగానే ఆయనకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఇది ఉపాధ్యాయ సమాజానికీ ఒక ప్రత్యేక గౌరవమన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం : మస్రత్ సుల్తానా


జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా తదితరులు

**మలక్ పేట , నవంబర్ 6, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా పలువురు నాయకులు కార్యకర్తలు కలిసి తదితరులతో కలిసి ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో పాటు పడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని తెలిపారు . ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరిహరా క్షేత్రంలో ఘనంగా ప్రత్యేక పూజలు


అఖండ దీపోత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న భక్తులు

**మలక్ పేట , నవంబరు 6, ప్రభాతవార్త:** మలక్ పేట పల్టాన్ లోని శ్రీ హరిహర క్షేత్రం శ్రీ మైసమ్మ దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి అధిక సంఖ్యలో భక్తులు దేవాలయానికి విచ్చేసి అఖండ దీపోత్సవం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అంతక ముందు సామూహిక సత్యనారాయణ వ్రత పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ట్రస్ట్ చైర్మన్ సూగూరు రమేష్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్తాండ రావు, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, సభ్యులు సరాపు శ్రీహరి, రేణు అగర్వాల్, పారిజాత రెడ్డి, వనం సత్యేందర్, శెట్టి విజయకుమార్, రొద్ద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా రాణించాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి


ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. నవంబర్. 6. ప్రభాతవార్త** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 2 లో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంను బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్‌ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలత, చైర్మన్ వరలక్ష్మీ, డైరెక్టర్ రవీందర్, భగవంత రెడ్డి, రవీందర్, సెక్రటరీ భాను, మరియు కాలనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, హరిహర పురం కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, బిజెపి పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు తదితరులు ఉన్నారు.

## ఘనంగా కార్తిక పౌర్ణమి వేడుకలు


ఉత్సవంలో పాల్గొన్న పవన్‌కుమాం

**ఎల్.బి.నగర్, నవంబర్ 6 ప్రభాతవార్త:** కార్తీక పౌర్ణమి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కొత్తపేట డివిజన్ శివగంగకాలనీ, సత్యనగర్‌కాలనీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమాలకి ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ హాజరై పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కార్తీక మాసం భక్తి, శ్రద్ధ, సేవకు ప్రతీకమన్నారు. ప్రత్యేకంగా పౌర్ణమి రోజున దీపాలు వెలిగించడం, శివాలయ దర్శనం చేయడం ఎంతో శ్రేయస్సును అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివగంగా, సత్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, బిజెపి నాయకులు కొత్త తిరుమల్, ర్యాక శ్రీనివాస్, శరణ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి


కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, నవంబర్ 6 ప్రభాతవార్త:** విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ అన్నారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వనిత ఎల్బీనగర్ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌళిక సదుపాయల కల్పన కోసం పాఠశాలలకు కుర్చీలను అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో పనిచేసే మహిళ సిబ్బందికి బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ క్లబ్ ద్వారా చేయూత నందిస్తమన్నారు. గతంలో ఈ పాఠశాల విద్యార్థులకు బెల్ట్స్, ఐడెంటిటీకార్డ్స్, నోట్‌బుక్స్, స్టేషనరీ కిట్స్ అందజేశామన్నారు. పాఠశాల అభివృద్ధి సహకరించిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాలు ఆంజనేయలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అనంతం, చంద్రమౌళి, దొడ్డి వినయ్‌సంతోషి, బదం జగదీష్, గంగిశెట్టి నవీన్‌కుమార్, బలసా హరిప్రాద్, స్వప్న, మాషెట్టి మాధవి, చిత్తలూరి శ్రీలత, భిక్షమయ్య, శ్యామల పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలి : కార్పొరేటర్


డిఇఇ వనజకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో వీది దీపాల సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి విద్యుత్ శాఖ డిఇఇ వనజను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. డివిజన్ పరిధిలో కొన్ని చోట్ల కరెంట్ పోల్స్ ధ్వంసమై ప్రమాదకరంగా ఉన్నాయని, అలాంటి వాటిని తొలగించి నూతన పోల్స్‌ను ఏర్పాటు చేయాలని, కొన్ని చోట్ల పోల్స్ ఎత్తు 14 మీటర్లకు పైగా ఉండడం వల్ల రోడ్లపై వెలుతురు సరిగ్గా రావడం లేదని, తక్కువ ఎత్తు ఉన్న నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని డిఇఇని కార్పొరేటర్ అరుణ కోరారు.

## అవసరమైన చోట నూతన విద్యుత్‌పోల్స్, లైట్స్ ఏర్పాటు: కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి


కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

**సైదాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని డార్క్ ప్లేసెస్‌లో రూ.9.27లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న వీది దీపాల ఏర్పాటు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరమైన చోట నూతనంగా విద్యుత్ పోల్స్, లైట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీది దీపాల నిర్వాహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, కాలనీవాసులు సిఎస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శివారెడ్డి, మోహన్‌రావు, మోహన్‌రెడ్డి, నర్సింహామూర్తి, బంగారు రావు పాల్గొన్నారు.

## సబితారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగదు : రామిడి రాంరెడ్డి


అందెల వ్యాఖ్యలను ఖండిస్తున్న బిఆర్‌ఎస్ నాయకులు

**సరూర్‌నగర్, నవంబర్ 6 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అన్నారు. గురువారం బడంగ్‌పేట్ పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ ప్రజాప్రతినిధి అయిన సబితారెడ్డిపై అందెల చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను ఖండించారు. సబితారెడ్డిపై ఆరోపణలు చేసే క్రమంలో శ్రీరాములు యాదవ్ వాడిన భాష సరిగ్గా లేదని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే మాటలను వెనక్కి తీసుకొని సబితారెడ్డికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, యెల్చల సుదర్శన్‌రెడ్డి, ఎర్రబట్టు శ్రీనివాస రాజు, పుట్టగళ్ళ సంతోష్, గట్టు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి కూడా అందెల వ్యాఖ్యలను ఒక ప్రకటనలో ఖండించారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పరామర్శ


మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 6 ప్రభాతవార్త :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ దశదిన కర్మ సందర్భంగా గురువారం పలువురు బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఆయన నివాసానికి చేరుకుని సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, పలువురు పార్టీ నేతలు హరీష్‌రావును పరామర్శించారు. సత్యనారాయణ మరణం వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. దేవుడు వారికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో ఘనంగా ఆకాశ దీప పూజలు


ఆకాశ దీప పూజలో పాల్గొన్న ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో కార్తీక ఆకాశ దీప పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ వారు ఆచార సాంప్రదాయాల ప్రకారం భక్తిశ్రద్ధలతో జరిపారు. లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, జ్వాలా తోరణ పూజలు జరిపిన అనంతరం ఆకాశ దీప పూజ నిర్వహించారు. అదే విధంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని కూడా జరిపారు. ప్రధాన అర్చకులు లక్ష్మీ గణపతిరావు, శ్రీకాంత శర్మ, హయగ్రీవ శర్మ, శ్రీనివాసప్రసాద్ శర్మలు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.